

# లవ్

కె.వి.రామదాస్

అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ దువ్వుకుంటున్నాడు గోపాలం. అద్దం వద్ద కుదురుగా కూర్చుని తల దువ్వుకోవాలంటే స్టార్ టీవీకి అలవాటుపడ్డ ప్రేక్షకుడికి దూరదర్శన్ చూసినంత కష్టంగా వుంటుంది గోపాలంకి. అటువంటి గోపాలం వారం రోజులుగా తన క్రాఫింగుని అరగంట కొకసారి సరిచేసుకుంటున్నాడు. ఇంతకీ గోపాలంలో అకస్మాత్తుగా వచ్చిన ఈ మార్పుకి కారణమేమిటంటే, అతనింటికి ఎదురుగా ఓ అమ్మాయి కొత్తగా అద్దెకి దిగడమే. దిగిన కొద్ది రోజులకే ఇద్దరి చూపులూ కలుసుకోవడంతో ప్రారంభమై, ముసిముసి నవ్వుల వరకు వచ్చింది వ్యవహారం.

గోపాలంలో ఎప్పడూ లేని హుషారుని ఈమధ్యే గమనిస్తున్న ఆఫీసు కొలీగ్ అరుణ ఓ రోజు వుండబట్టలేక "ఈమధ్య వూలరంగడిలా తయారవుతున్నావు, హుషారు కూడా ఎక్కువైంది. కారణమేమిటో?" అని కవ్విస్తూ అడిగింది. తను అందంగా తయారైతే ఓర్వలేని అరుణని చూసి మనసులోనే తిట్టుకుంటూ "నిజం చెపాలంటే, నా హుషారుకీ, నూతన శక్తికీ కారణం 'సింకారా' టానిక్!" అని టీవీ ఎడ్వర్టైజ్‌మెంట్ మాదిరిగా ఫోజు పెడుతూ చెప్పాడు గోపాలం. గోపాలం మాటల్లోనే కాక చేతల్లో కూడా టీవీ ప్రభావం ఎక్కువని తెలిసిన అరుణ మూతి మూడు వంకరలు తిప్పింది.

ఆ రోజు రాత్రి గోపాలం ఒక నిర్ణయానికి వచ్చేశాడు. తన లవ్వు నలుగురిలో నవ్వులపాలు కాకుండా వుండాలంటే, ధైర్యం చేసి ఎదురింటి అమ్మాయికి తన ప్రేమని చెప్పేసి, తమ లవ్వుకి శుభం కార్డు వేసేయక తప్పదు.

అందుకే, మరి ఆలస్యం చేయదలచుకోలేదు గోపాలం. ఆ మర్నాడు సమయం చూసి ధైర్యంగా ఎదురింటికి వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాడు. క్షణాల్ని లెక్కబెడుతూ నిలుచున్నాడు. ఇంతలో తలుపులు తెరచుకున్నాయి. అతడు ఆశించినట్టుగా ఎదురుగా ఆ అమ్మాయ్! ఆమెని చూసేసరికి గోపాలం గొంతులో తడారిపోయింది.

"ఆ రోజు రాత్రి గోపాలం ఒక నిర్ణయానికి వచ్చేశాడు. తన లవ్వు నలుగురిలో నవ్వుల పాలు కాకుండా వుండాలంటే శుభం కార్డు వేసేయక తప్పదు"

వెంటనే గొంతు పెగల్లేదు. అయితే, గోపాలం మనసు ప్రేమని కక్కేయమని ఘోషిస్తున్నది. ఆఖరికి ధైర్యాన్నంతా కూడగట్టుకొని "మేడమ్! నా ప్రేమని మీకు ఎలా తెలియజేయాలో తోచడం లేదు. రెండు ముక్కల్లో చెప్పాలంటే, మీ అందం నన్ను వెర్రివాడిని చేస్తోంది. మీ ముఖవర్చస్సు నిజంగా సూపర్బ్! రియల్లీ ఐ లవ్ యూ" అని గడగడా చెప్పేశాడు గోపాలం.

ఈ హఠాత్ పరిణామానికి ఆమె ఆశ్చర్యపోయింది. అంతలోనే తేరుకుని పగలబడి నవ్వడం మొదలెట్టింది. ఆమె నవ్వు గోపాలంకి ఏమాత్రం అర్థం కాలేదు. "ప్లీజ్ మేడమ్! ఆన్సర్ మీ!" అంటూ అర్థించాడు గోపాలం.

ఇంతలో లోపల నుంచి ఐదేళ్ళ పాప పరిగెట్టుకుంటూ వచ్చి "మమ్మీ ఈ రోజు నేను స్కూల్‌కి వెళ్ళను!" అంటూ ఆమెని చుట్టుకుని మారాం చేయసాగింది.

"నా సమాధానం ఏమిటో అర్థమైందనుకుంటాను, మిస్టర్! ఇకపోతే నా అందం, ముఖవర్చస్సు అంటూ ఏవేవో పొగిడావే, వాటికి కారణం 'సంతూర్ సబ్బు' వారి సౌజన్యం" అని తిరిగి గలగల నవ్వసాగిందామె.

●●